




## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

**ఓ రాత్రి** ఇద్దరు మిత్రులు కలిసి మందుపార్టీ చేసుకున్నారు. మర్నాడు వారిద్దరిలో ఒకరు హాస్పిటల్లో మేల్కొన్నారు. తన వంటికి కట్లుండడం గమనించి మిత్రుడ్ని ఏం జరిగిందని అడిగాడు.

"నిన్నరాత్రి నీకు మందు ఎక్కువైనట్లుంది. డాబా పిట్టగోడమీదికి ఎక్కి  'నేను పక్షిలా ఎగురుతాను చూడు..' అంటూ కిందికి దూకావు.."

"ఏం మనిషివి నువ్వు!? మనిషెక్కడైనా పక్షిలా ఎగరగలడా? నన్నెందుకు ఆపలేదు?" ప్రశ్నించాడు మొదటి మిత్రుడు.

"నువ్వు పక్షిలా ఎగరగలవని ఆ సమయంలో నాకు అనిపించింది.." జవాబు చెప్పాడు రెండో మిత్రుడు..!

❀❀

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"డాక్టర్‌గారూ! నాకీ మధ్య మధ్యాహ్నం పూట నిద్రలో భయంకరమైన పీడకలలు వస్తున్నాయి. ఇవి రాకుండా ఏదన్నా మాంచి మందివ్వండి" అనడిగాడు పాపారావు.

"నిద్రపోయే ముందు రెండూ గ్లాసుల చల్లటి నీళ్ళు తాగండి. పీడకలలు రావు" సలహా ఇచ్చాడు డాక్టరు.

"లాభం లేదండీ. మా ఆఫీసులో ఐసు నీళ్ళు దొరకవు. ఎలా?" అన్నాడు పాపారావు దిగులుగా.

ఓ డాక్టరుగారి భార్యామణి ఉద్యోగం కోసం అప్లయ్ చేసి ఇంటర్వ్యూ వస్తే వెళ్ళింది. అక్కడి అధికారులు ఆమెను చూసి –

"పెద్దగా ప్రాక్టీసున్న డాక్టర్‌గారి భార్యగా మీకెంతవరకూ ఈ ఉద్యోగం అవసరం చెప్పండి"

"చాలా అవసరం. మా ఆయనతో మాట్లాడాలంటే కన్సల్టింగ్ ఫీజు పదిరూపాయలు. ఇక ఆయన మనిషిని ముట్టుకుంటే పాతిక రూపాయలు. రోజూ నాకు ముప్పై అయిదు రూపాయలు ఖర్చు. మరిదంతా భరించాలంటే ఉద్యోగం తప్పనిసరి."

"మా సంస్థలోని ఉద్యోగులు నెలసరి జీతాల కోసం కాచుక్కూర్చోరు"

"ఆశ్చర్యం. అంత సంతృప్తికరంగా వుంటున్నారన్నమాట."

"అవును. కటింగ్స్ పోతే చేతికి చిల్లిగవ్వ కూడా రాదనేది గత రెండేళ్ళుగా వారి స్వానుభవం."

క్లాసులో జనరల్ నాలెడ్జి పాఠం జరుగుతోంది. "సామాన్య మానవుడు అంటే ఎవర్రా?" టీచర్ రఘుని అడిగాడు.

"ఒక్క 'సామాన్యశాస్త్రం' తప్ప మిగతా ఏ శాస్త్రమూ చదవనివాడు సార్" రఘు ఠక్కున జవాబిచ్చాడు.

పానకాలరావు అదృష్టం కొద్దీ పెద్ద కంపెనీలో ఉద్యోగం దొరికింది. జాయినయ్యే రోజున మేనేజర్ వివరించాడు.

"మా ఉద్యోగులందరికీ మేం స్వంత కాలనీలోని క్వార్టర్స్ ఇస్తాం. అది అవసరం లేదంటే జీతంతోపాటు అదనంగా అలవెన్సు ఇస్తాం."

పానకాలరావు పొంగిపోయాడు. "అలవెన్సు ఎందుకు గానీ, క్వార్టర్స్ ఇప్పించండి సార్. ఇంతకీ నెలకు ఎన్ని క్వార్టర్ బాటిల్స్ ఇస్తారండీ? క్వార్టర్సేనా? ఫుల్‌బాటిల్స్ ఇచ్చే వీల్లేదాండీ?"

బొమ్మ బొరుసు దగ్గరనుంచి గుర్రప్పందాల వరకు జూదమంటే చెవి కోసుకుంటాడు కిష్టయ్య. ఆ రోజున గుర్రప్పందాలకి వెళ్తుంటే హనుమయ్య కనిపించాడు.

"ఏంటి కిష్టయ్యా! ఇవ్వాల మంచి హుషారుగా ఉన్నావు?"

"ఇవ్వాళ జాక్‌పాట్ గ్యారంటీగా మనదే. ఏం ఢోకా లేదు."

"ఎందుకని?"

"ఇవ్వాళ అన్నీ అట్టా ఒనగూడి వచ్చాయి. పొద్దున కళ్ళు తెరచి చూద్దును గదా ఎదురుగా తారీకు ఏడు కనిపించింది. బయటకెళ్తూ జేబు చూసుకుంటే సరిగ్గా ఏడు రూపాయలే ఉన్నాయి. మధ్యాన్నం హోటల్లో టిఫిన్ చేస్తుంటే కరెక్టుగా ఏడుగురే ఉన్నారక్కడ. అప్పు కోసం బయలుదేరితే సరిగ్గా ఏడు రూపాయలే దొరికింది. కాబట్టి ఏడు ఇవ్వాళ నా లక్కీ నంబరు."

సాయంత్రం రేసు నుంచి తిరిగొస్తుండగా వాళ్ళిద్దరూ మళ్ళీ కలిశారు.

"ఏం కిష్టయ్యా! జాక్‌పాట్ కొట్టావా?"

"ఏడో రేసులో ఏడో నంబరు గుర్రం మీద కాశాను. అది ఏడోదిగా వచ్చింది. నా లెక్క కరట్టే. తిరకాసెక్కడుందా అని ఆలోచిస్తున్నాను."

"మా పక్కింటావిడ మొగుడి సంపాదన సరిపోక, పిల్లలతో సతమతమైపోతోంది. ఆవిడ మొహం చూస్తే, తిండి తిని ఎన్నాళ్ళయిందో అనిపిస్తుంది"

"పాపం అలాంటి వాళ్ళతో మాట్లాడాలంటేనే చాలా బాధగా ఉంటుంది."

"పొరుగావిడ గదా నాకు తప్పదు. అందుకని ఆవిడతో మాట్లాడేటప్పుడు కళ్ళు మూసుకుంటాను."

ఢిల్లీనుంచి వచ్చిన ఒక బడా మంత్రి గ్రామాలు పర్యటిస్తున్నాడు. వయస్సు మళ్ళిన ఒకడి దగ్గరకి వెళ్ళి "క్షేమంగా ఉన్నావా? అన్ని వస్తువులు దొరుకుతున్నాయా? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పరిస్థితులు బాగా మెరుగయ్యాయిగదూ?" అని ప్రశ్నించారు.

"అయ్యన్నీ నాకు తెలవదు బాబో! ఇంతకుముందు. నాకు రెండు పంచెలు, రెండు సొక్కాలు, రెండు అంగొస్త్రాలు, ఒక జత సెప్పులు ఎప్పుడూ ఉండేయి. దీని శిగదరగ ఇప్పుడొకటుంటే ఒకటుండదు. ఏం కొనలేకపోతుంటేను"

"ఆఫ్రికా దేశాల్లో తిండి, బట్టకూడా లేనివాళ్ళు కొల్లలుగా ఉన్నారు తెలుసా?"

"అయితే ఆళ్ళకు సొతంత్రం మనకన్నా శానా ముందే వచ్చేసిందన్నమాట."

కిరోసిన్ కొరత తీవ్రంగా వుంది. అసలే కిరసనాయిల్ డీలర్స్ మీద రెయిడ్స్ జరుగుతున్నాయి. దొంగసరుకు పట్టుకొనడానికి. ఓ చిన్న దుకాణం యజమాని అతి కష్టమ్మీద కొన్ని డబ్బాల కిరసనాయిలు సంపాయించాడు. తన మీద కూడా రెయిడ్ జరిగితే అవి ఎక్కడ బయటపడతాయోనన్న భయం కొద్దీ అసిస్టెంటును కేకేసి –

"ఒరేయ్! ఈ పది డబ్బాలూ తీసుకుపోయి ఇంటి వెనుక కొబ్బరి చెట్ల కింద దాచేసి రారా" అన్నాడు.

అసిస్టెంటు తు.చ తప్పక అలాగే చేసి వచ్చాడు. వస్తూనే "డబ్బాలన్నిటినీ కొబ్బరి చెట్ల కింద గొయ్యి తీసేసి పాతి పెట్టేశాను సార్. మరి కొట్టేసిన కొబ్బరి చెట్లను ఏం చెయ్యమంటారండీ" అనడిగాడు.

స్కూల్లో ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది."ఇంగ్లీషు 'ఆల్ఫబెట్సు'లో మొత్తం ఎన్ని అక్షరాలుంటాయి?" డి.ఇ.ఓ ఓ విద్యార్థిని లేపి అడిగాడు.

"ఆల్ఫబెట్సు అంటే ఏమిటి సార్?" వాడు ఎదురు ప్రశ్న వేశాడు.

"అవే! ఎ.....బి....సి....డి...లు ఆ మాత్రం తెలీదూ?"

"నాలుగు" ఠక్కున చెప్పాడు ఆ విద్యార్థి.

COMMENTS